క్లుప్తంగా

ఘోషాస్పత్రిలో అన్నదానం



పేషెంట్ల సహాయకులకు అన్నదానం చేస్తున్న నీలయ్య కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలేనికి చెందిన భీశెట్టి నీలయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమార్తె మల్ల అప్పలకొండ, కుమారులు భీశెట్టి వెంకట అప్పారావు, కనకరాజు, వెంకటేశ్వరరావు ఆర్థిక సాయంతో ఆదివారం ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి వద్ద స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేషెంట్ల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నీలయ్య కుటుంబ సభ్యులు, స్వామి వివేకానంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

'జక్కాన' స్ఫూర్తితో ప్రభుత్వ రంగ రక్షణకు కృషి



సభలో మాట్లాడుతున్న లోకనాథం

అల్లిపురం : పోర్టు యూనియన్ అధ్యక్షుడు జక్కాన సత్యనారాయణ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకు ప్రతి కార్మికుడు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. లోకనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎంపీఎస్ శర్మ అన్నారు. పోర్ట్ యూనియన్ అధ్యక్షుడు జె. సత్యనారాయణ ఉద్యోగ విరమణ, షష్ఠి పూర్తి కార్యక్రమం ఆదివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రంలో వారితో పాటు 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేసీ కుమార్, పి.మణి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొని జక్కాన సత్యనారాయణ, రాములమ్మ దంపతులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జక్కాన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి డిమాండ్



బ్యాంకు వద్ద ప్లకార్డులతో ఉద్యోగుల నిరసన

సీతమ్మధార : బ్యాంకులో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ సీతమ్మధారలోని యూనియన్ బ్యాంకు వద్ద ట్విట్టర్ క్యాంపెయిన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్. వసంతరావు మాట్లాడుతూ బ్యాంకులో ఔట్‌సోర్సింగ్ పద్ధతిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి అలంకరణలో శ్రీవారు



రంగనాథస్వామి అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

సీతమ్మధార: మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో దేవీ నవరాత్రులు, ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం రంగనాథ్ స్వామి అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటలకు దుర్గా హోమం, మహాలక్ష్మి దుర్గా అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రధానార్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం శ్రీవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు తిరువీధి జరిపారు.

సర్వ మంగళ మాంగల్యే.. శివే సర్వార్థ సాధికే

- అంతటా వెల్లివిరుస్తున్న దసరా శోభ
- అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు, అభిషేకాలు



దొండపర్తి మండా వారి పేటలో భక్తులకు అన్నసమారాధన చేస్తున్న నిర్వాహకులు

కంచరపాలెం : జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో సుందరంగా అలంకరించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, చండీహోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్‌రావు, రామకృష్ణారావు, జోజిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన..

సీతమ్మధార : వెంకటేశ్వర కళా సమితి ఆధ్వర్యంలో దొండపర్తి మండా వారి పేటలో ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. కమిటీ సభ్యులు మద్ది శ్రీనివాసరెడ్డి, గండిబోయిన వంశీ రాము, ఆర్. శ్రీనివాసరెడ్డి, అల్లూరి అప్పలరెడ్డి, సంగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లలితా కాలనీలో మహాన్నదానం..

దాబాగార్డెన్స్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 31వ వార్డు పరిధి లలితాకాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద ఆదివారం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బత్తిన నాగరాజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్ర నేతృత్వంలో పిల్లలు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు.

దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మహిళలు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేస్తున్నారు. దుర్గా మండపాల వద్ద ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి.



భక్తులను ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

వేడుకగా దుర్గాష్టమి..

అల్లిపురం : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సాగరగిరి కనకదుర్గమ్మ ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ అర్చకులు కూరగాయలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అల్లిపురం వివేకానంద కాలనీలో వెలసిన అనఘాలక్ష్మి దుర్గమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు. మెయిన్ రోడ్డులోని ధనశక్తి అమ్మవారి ఆలయంలో దుర్గమ్మ విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న బత్తిన నాగరాజు

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న..

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 33వ వార్డు కుమ్మరవీధిలో శ్రీ లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా ఆయన అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొర్రా శ్రీనివాసరెడ్డి, పి.రాము, పీవీ నరసింహారెడ్డి, పీలా మహేష్ , వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా దుర్గాలమ్మ అమ్మవారు..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ జంక్షన్‌లో వెలసిన శ్రీ దుర్గాలమ్మ అమ్మవారు ఆది వారం శ్రీ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ఈవో పి.శేఖర్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు సకల సదుపాయాలు కల్పించారు. అర్చకులు అమర్‌నాథ్, కృష్ణ అమ్మవారికి పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ బత్తి మంగరాజు, ధర్మకర్తలు డి.లక్ష్మీనారాయణ, కె.వరలక్ష్మి, వెంకటలక్ష్మి, రమణమ్మ, డి.వేణుగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



శాకంబరి అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



ధనశక్తి అమ్మవారి పీఠంలో విశేష అలంకరణలో దుర్గమ్మ



అల్లిపురం మెయిన్‌రోడ్డులో 15 అడుగుల దుర్గమ్మ



దుర్గాదేవి రూపంలో దుర్గాలమ్మ అమ్మవారు



శాకంబరిగా సాగరగిరి కనకదుర్గ అమ్మవారు



కనకదుర్గగా అనఘాలక్ష్మిదేవి

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీకి చెందిన నండూరి వెంకట నరసింహం, లావణ్య దంపతుల ఇంట్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. సకల దేవతా మూర్తులు ఒకే చోట దర్శనమివ్వడంతో స్థానికులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. దశావతారాలు, అష్టలక్ష్మీ రూపాలు, పూరీజగన్నాథ ప్రతిమలు, శ్రీవేంకటేశ్వరస్వామి రూపాలతో పాటు పలువురు ప్రసిద్ధ దేవతామూర్తుల ప్రతిమలు ఏర్పాటు చేశారు. దసరా, సంక్రాంతి సమయంలో ఆడ పిల్లలు ఉన్న ఇళ్లలో బొమ్మకొలువు ఏర్పాటు చేయడం తెలుగు వారి సంప్రదాయమని, ఇందులో భాగంగానే ఈ కొలువు ఏర్పాటు చేశామని నండూరి దంపతులు తెలిపారు.



సకల దేవతలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

ఘనంగా ధర్మ ప్రచార వారోత్సవాలు ప్రారంభం



జగన్నాథస్వామి ఆలయంలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



జ్యోతి ప్రజ్వలనతో వారోత్సవాలను ప్రారంభిస్తున్న దొండపర్తి ఎరుకుమాంబ ఆలయ చైర్మన్ సర్వేశ్వరరెడ్డి

దాబాగార్డెన్స్ : దేవదాయ శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ధర్మప్రచార వారోత్సవాలు ఆదివారం నగరంలోని టౌన్‌కొత్తరోడ్డు సమీపాన వెలసిన జగన్నాథస్వామి ఆలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 28 వరకు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా కలగ మురళీకృష్ణచే భాగవత పురాణ ప్రవచనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మారోజు శ్రీనివాస్, ధర్మకర్తలు కంటుముచ్చు సాగర్, వాకాడ రాధ, సూరిని రాము, కంచర్ల రవి, కొండా జ్యోతి, ధనాల రాంబాబు, శీల శివప్రసాద్, ఎక్స్ అఫిషియో సభ్యుడు జగన్నాథాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

దొండపర్తి ఎరుకుమాంబ ఆలయంలో..

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం ధర్మ ప్రచార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సారథ్యంలో ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లి స్వాతి, పిల్లి దుర్గ, దళాయి అన్నపూర్ణ, శరగడ నరసింగరావు, బి.సూర్యనారాయణ, పి.లక్ష్మి నారాయణమ్మ, పెద్దాడ రమణమ్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పిఠాపురం కాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న బొద్దాం కమిటీ సభ్యులు

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 100 రకాల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవ సమితీ సభ్యుడు రావణ అక్షయ మాట్లాడుతూ దసరా అంటే పదింటిని నాశనం చేసేదని అర్థమన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రబోధ సేవా కమిటీ సభ్యులు 30 మంది పాల్గొన్నారు.

దసరా పూజకు సిద్ధం



వాటర్ సర్వీసింగ్ సెంటర్ వద్ద బారులు తీరిన వాహనాలు



టీవీ రిపేర్ దుకాణంలో శుభ్రం చేసుకుంటున్న సిబ్బంది



శుభ్రం చేసుకుంటున్న పంక్చర్ల షాపు యజమాని

అల్లిపురం : శాస్త్రం మాట ఎలా ఉన్నా దసరా ఉత్సవాలకు నగరం సిద్ధమయింది. దశమి సోమవారం చేయాలా మంగళవారం చేయాలా అని నగర ప్రజల్లో గందరగోళం నెలకొంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులు సెలవులు ప్రకటించడంతో రెండు రోజులు పండగను సెలబ్రేట్ చేసుకునేందుకు నగర ప్రజలు సమాయత్తమవుతున్నారు. శ్రవణా నక్షత్రం ఉన్నప్పుడే శమీ పూజ నిర్వహించాలని పండితులు చెబుతుండటంతో సోమవారం శ్రవణానక్షత్రం ఉండటంతో సోమవారం దేవాలయాల్లో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సూర్యోదయ తిథిని అనుసరించి దశమి ఉండడంతో ప్రజలు దసరా పండగ మంగళవారం చేసేందుకు సమాయత్తవుతున్నారు. ఈ నేపథ్యంలో వాహనాలు శుభ్రపరచుకోవడం పరిపాటి. ఈ మేరకు ఆదివారం వాటర్ సర్వీసెంగ్ సెంటర్ల వద్ద వాహనాలు బారులు తీరాయి. అదే విధంగా మెకానిక్ దుకాణాలు, ఇతర సర్వీసింగ్ సెంటర్ల సిబ్బంది వారి దుకాణాలు శుభ్రపరుచుకుంటూ ఆదివారం బిజీగా కనిపించారు.

'ధూమపానం హీరోయిజం కాదు'



మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు

బీచ్ రోడ్డు: జీవితాలను అనారోగ్యం పాలు చేసే ధూమపానాన్ని హీరోయిజంగా సినిమాల్లో చూపించడం తగదని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆదివారం ధూమపానంపై వినియోగదారుల హక్కుల సంస్థ ఆధ్వర్యంలో వైఎంసీఏ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ పొగ తాగడంపై ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ధూమపానం మానేసిన పలువురిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు నవీన్ ప్రకాశ్‌శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు, పాల్గొన్నారు.

కొమరం భీమ్‌కు ఘన నివాళి



కొమరం భీమ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జిల్లా మహాబోధి సొసైటీ సభ్యులు

పెదగంట్యాడ: గిరిజనోద్యమ నాయకుడు కొమరం భీమ్ సేవలు మరువలేమని జిల్లా మహాబోధి సొసైటీ సభ్యుడు బోర వేణుగోపాల్ గౌతమ్ అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడ కూడలిలో కొమరం భీమ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ విముక్తి కోసం నిజాం సర్కారు నవాబుపై గెరిల్లా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాటాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీకేటి పెంటయ్య, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గోవిందరావు, ములకలపల్లి చిన్నారావు, కె.అన్నవరం పాల్గొన్నారు.

తిరుమల బాలాజీకి సహస్ర నామార్చన



పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీకి నిత్య విశేష పూజలు నిర్వహిస్తున్నారు. దసరా శరన్నవరాత్రులు పుణ్యదినాలను పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమల బాలాజీకి సహస్ర నామార్చన నిర్వహించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిపారు.